సాక్షి అన్నమయ్య జిల్లా

గురువారం । 14 । డిసెంబర్ । 2023



హృదయం.. పదిలం

అనారోగ్యపూరిత ఆహారపు అలవాట్లతో హృదయం గతి తప్పుతోంది. ఈ విషయం గుర్తించిన ప్రభుత్వం స్టెమీ కార్యక్రమం అమలుతో పేదల గుండెకు రక్షణ కల్పిస్తోంది. -IIలో



క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలి

క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలని స్మాల్ గేమ్స్ కార్యదర్శి వసంత అన్నారు. -IIలో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.120	రూ.160
రెండోరకం	రూ.70	రూ.116

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 341 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)



రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	380	460
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 809.540 కిలోలు

న్యూస్‌రీల్

26న అరుణాచలానికి ప్రత్యేక బస్సు

మదనపల్లె సిటీ: మార్గశిర పౌర్ణమి పురస్కరించుకుని అరుణాచలానికి ఈనెల 26న ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు ఆర్టీసీ-1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. 26న ఉదయం 9 గంటలకు బస్సులు బయలుదేరుతాయన్నారు. ఎక్స్‌ప్రెస్ బస్సులకు రాను,పోను చార్జీ రూ.670 చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకు 9959225676, 7382875034 నంబర్లలోల సంప్రదించాలన్నారు. భక్తులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి సంస్థను ఆదరించాలని కోరారు.

ఎక్స్‌ప్రెస్ రైలు తాత్కాలిక రద్దు

కలికిరి: నరసాపూర్-ధర్మవరం (17247) ఎక్స్‌ప్రెస్, ధర్మవరం-నరసాపూర్(17248) ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసులను తాత్కాలికంగా రద్దు చేస్తూ రైల్వే శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. గూడూరు-విజయవాడ మధ్యలో మూడో లైను ఏర్పాటు(నాన్ ఇంటర్ లాకింగ్) పనులు జరుగుతుండటంతో రైల్వే అధికారులు కొన్ని సర్వీసులను రద్దు చేశారు. ఇందులో భాగంగా ప్రతి రోజు ధర్మవరం నుంచి కదిరి, మొలకలచెరువు, కలికిరి, పీలేరు, పాకాల, తిరుపతి మీదుగా నరసాపూర్ వరకు వెళ్ళే ధర్మవరం ఎక్స్‌ప్రెస్(17248) ఈ నెల 15 నుంచి 20 వరకు ఆరు రోజులు, నరసాపూర్ నుంచి ధర్మవరం వరకు వెళ్లే నరసాపూర్ ఎక్స్‌ప్రెస్(17247) ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు ఐదు రోజుల పాటు రద్దయ్యాయి.

జెఎన్‌టీయూ అధ్యాపకురాలికి అవార్డు



బెస్ట్ టీచర్ అవార్డును అందుకుంటున్న అధ్యాపకురాలు శేష మహేశ్వరమ్మ

పులివెందుల రూరల్: స్థానిక జెఎన్‌టీయూ కళాశాలలో కెమిస్ట్రీ అధ్యాపకురాలిగా పనిచేస్తున్న శేష మహేశ్వరమ్మ బెస్ట్ టీచర్ అవార్డుకు ఎంపికైంది. అనంతపురం జెఎన్‌టీయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ రంగ జనార్దన్, రిజిస్ట్రార్ శశిధర్ చేతుల మీదుగా శేష మహేశ్వరమ్మ బుధవారం ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ఆర్.రమణారెడ్డి, వైస్ ప్రిన్సిపల్ ఎం.సూర్యనారాయణరెడ్డి తదితరులు ఆమెను అభినందించారు.

నూతన నియామకం

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అనుబంధంగా ఉండే రాష్ట్ర విద్యార్థి విభాగ కమిటీలో వైఎస్సార్ జిల్లా నుంచి ఇద్దరికి చోటు లభించింది. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కలవకూరి రమణ, రాష్ట్ర కార్యదర్శిగా షేక్ షఫీవుల్లాలను నియమించినట్లు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

జోనల్ ఇన్‌చార్జిగా ఎస్.సాయిరాంరెడ్డి

వైఎస్సార్ స్టూడెంట్ యూనియన్ వైఎస్సార్, నంద్యాల జిల్లాల జోనల్ ఇన్‌చార్జిగా సన్నల సాయిరాంరెడ్డి నియమితులయ్యారు. ఈయన నంద్యాల జిల్లాకు చెందిన వారు.

ఓటర్ల జాబితా తప్పులు లేకుండా తయారు చేయాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అన్నమయ్య జిల్లా జేసీ, డీఆర్‌ఓలు

రాయచోటి: ముసాయిదా ఓటర్ల జాబితా తప్పులు లేకుండా తయారు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. ముసాయిదా ఓటర్ల జాబితా సవరణలో భాగంగా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా బుధవారం ఉదయం జంక్ ఓటర్ల జాబితా, ఒకే ఇంటి నెంబర్ మీద పది అంతకన్నా ఎక్కువ ఓటర్ల జాబితాపై వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. అన్నమయ్య జిల్లా రాయచోటి కలెక్టరేట్ నుంచి జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జంక్ ఓటర్ల తొలగింపులో, ఒకే ఇంటి నెంబర్ మీద పది అంతకన్నా ఎక్కువ ఓటర్ల జాబితాను పరిశీలించి చర్యలను తీసుకోవడంలో మంచి పురోగతి ఉందని, వచ్చే వారంలో జరగబోయే సమీక్షకల్లా పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలని ఆదేశించారు.సమీక్ష అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ ఎలక్షన్ సెల్ అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సమావేశంలో డీఆర్‌ఓ సత్యనారాయణ, ఎలక్షన్ సెల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సూక్ష్మ వ్యవసాయం

- నీటిబొట్టు ఆదా చేసేలా చర్యలు
- రాయితీపై రైతులకు సూక్ష్మ సేద్య పరికరాలు
- జిల్లాలో 2023-24 ఏడాదికి 10,500 హెక్టార్లు లక్ష్యంగా అడుగులు
- ఇప్పటిదాకా 7799 హెక్టార్లలో టార్గెట్ పూర్తి



వేముల ప్రాంతంలో ఏర్పాటు చేసిన స్ప్రింక్లర్లు

కడప అగ్రికల్చర్: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత వ్యవసాయానికి పెద్దపీట వేశారు. పంటలసాగులో ఎన్నో సంస్కరణలను తీసుకొచ్చారు. రైతుల అభ్యున్నతికి కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే గ్రామాణ ప్రాంతాల్లో రైతు భరోసా కేంద్రాలను(ఆర్‌బీకే) ఏర్పాటు చేసి పంటల సాగుకు కావాల్సిన సలహాలు, సూచనలు అందిస్తున్నారు. ఉన్న ఊర్లోనే సాగు పరికరాలు, ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచి సాగుకు సహకరిస్తున్నారు. అలాగే రైతులు తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో వ్యవసాయ, ఉద్యాన పంటలు సాగు చేసుకునేందుకు వీలుగా సూక్ష్మ సేద్యాన్ని ప్రోత్సహిస్తున్నారు. రాయితీపై సూక్ష్మ సేద్య పరికరాలను సమకూరుస్తున్నారు. నచ్చిన కంపెనీ ఎంచుకునే అవకాశాన్ని రైతులకు కలిస్తూ ఆర్‌బీకేలలో రిజిస్ట్రేషన్ పక్రియను చేపట్టారు. ఈ పక్రియ ప్రస్తుతం జిల్లాలో మమ్మరంగా సాగుతోంది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సూక్ష్మ సేద్య పరికరాల కోసం 10500 హెక్టార్లు లక్ష్యాన్ని కేటాయించగా ఇప్పటిదాకా 17397 మంది రైతులు 21831 హెక్టార్లకు ఆర్‌బీకేలలో రిజిస్ట్రేషన్‌ను చేసుకున్నారు.

సబ్సిడీ వివరాలు ఇలా...

సూక్ష్మ సేద్య పథకంలో 5 ఎకరాల లోపు భూమి కలిగిన సన్న, చిన్న కారు రైతులకు 90 శాతం సబ్సిడీపై డ్రిప్ పరికరాలను ఇవ్వనున్నారు. డ్రిప్ యూనిట్ విలువలో 10 శాతం రైతు భరించాల్సి ఉంటుంది. అలాగే స్ప్రింక్లర్లకు సంబంధించి 55 శాతం ప్రభుత్వ సబ్సిడీతో మంజూరు చేయగా మిగతా 45 శాతం రైతు భరించాల్సి ఉంటుంది.

- 5 నుంచి 10 ఎకరాల మధ్య భూమి కలిగిన రైతులకు 70 శాతం సబ్సిడీ డ్రిప్పు పరికరాలను, 45 శాతం సబ్సిడీతో స్ప్రింక్లర్లను అందచేస్తారు. సబ్సిడీ పోను మిగతా సొమ్మును రైతులు భరించాల్సి ఉంటుంది.
- గతంలో సబ్సిడీతో డ్రిప్, స్ప్రింక్లర్లు తీసుకుని 7 సంవత్సరాలు పూర్తి చేసుకున్న రైతులు మళ్లీ వీటిని పొందేందుకు అర్హులు
- భూమి కలిగిన ప్రతి రైతుకు(భార్య, భర్త) ఈ సబ్సిడీ పథకం వరిస్తుంది.

	రైతుల సంఖ్య	ఏరియా (హెచ్‌ఏ)
టార్గెట్ -	10,500	
అచీవ్‌మెంట్	6388	7799
మెటీరియల్ పంపిణీ	5274	6428

- మామిడి,సపోటా, చీని, జామ, అరటి, బొప్పాయి, విజిటబుల్, పూలతోటలు, పసుపు, ఉల్లి పంటలకు డ్రిప్, బుడ్డశనగ, వేరుశనగలకు స్ప్రింక్లర్లు ఏర్పాటు చేసుకోవచ్చు.
- డ్రిప్, స్ప్రింక్లర్ల ఏర్పాటుకు 2023-24 సంవత్సరానికి జిల్లాలోని 36 మండలాల పరిధిలో 10,500 హెక్టార్లను టార్గెట్‌గా ఇచ్చారు. ప్రస్తుతం జిల్లాలోని ఆర్‌బీకెలలో ఇందుకు సంబంధించి రిజిస్ట్రేషన్ పక్రియలో సాగుతోంది. డ్రిప్పు, స్ప్రింక్లర్లు అవసరం ఉన్న రైతులు తమ పరిధిలోని ఆర్‌బీకేకు వెళ్లి అగ్రికల్చర్ అసిస్టెంట్, హార్టికల్చర్ అసిస్టెంట్లను కలిసి వివరాలను నమోదు చేయించుకుంటున్నారు.

7799 హెక్టార్లకు టార్గెట్ అచీవ్‌మెంట్ ....

జిల్లాలో డ్రిప్పు, స్ప్రింక్లర్ల పరికరాలకు సంబంధించి 10500 హెక్టార్లు లక్ష్యాన్ని కేటాయించగా ఇప్పటిదాకా 17397 మంది రైతులు 21831 హెక్టార్లకు రిజిస్ట్రేషన్‌ను చేసుకున్నారు. ఇందులో 6383 మందికి సంబంధించి 7799 హెక్టార్లకు టార్గెట్‌ను అచీవ్‌మెంట్‌ను చేశారు. ఇందులో 5274 మంది రైతులకు సంబంధించి 6428 హెక్టార్లకు మెటీరియల్‌ను కూడా సరఫరా చేసింది.

నియోజకవర్గం	టార్గెట్	రిజిస్ట్రేషన్		అడ్మిషన్ సాంక్షన్	
		రైతులు	ఏరియా	రైతులు	ఏరియా
పులివెందుల	5715	8082	10662	3148	3982
జమ్మలమడుగు	1945	3459	4677	1452	1902
కమలాపురం	1215	1916	2358	673	785
బద్వేల్	620	1673	1928	357	410
మైదుకూరు	620	1500	1458	491	460
పొద్దుటూరు	160	244	292	109	120
కడప	10	05	07	03	04
రాజంపేట	215	518	450	150	136

75 శాతం లక్ష్యం చేరువ...



తక్కువ నీటితో అధిక విస్తీర్ణంలో పంటలు సాగు చేసుకునేలా ప్రభుత్వం రైతులను ప్రోత్సహిస్తోంది. డ్రిప్, స్ప్రింక్లర్ల ఏర్పాటుకు సంబంధించి 2023-24 సంవత్సరానికి ప్రభుత్వం జిల్లాకు 10,500 హెక్టార్లను టార్గెట్ ఇచ్చింది. ఇప్పటి వరకు 75 శాతం సాధించాం. మిగతా లక్ష్యాన్ని మార్చి చివరి నాటికి పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాం. డ్రిప్పు, స్ప్రింక్లర్లు కావాల్సిన వారు తమ సమీపంలోని ఆర్‌బీకేలకు వెళ్లి పేర్లను నమోదు చేయించుకోవాలి.

– మూలి రవీంద్రనాథరెడ్డి, ప్రాజెక్టు డైరెక్టర్, ఏపీఎంఐపీ

కార్మిక కుటుంబాలకు రూ.30 లక్షల పరిహారం

- వైఎస్సార్ షాపింగ్ కాంప్లెక్స్, టీబీ కాంప్లెక్స్‌ల లీజు 33.33 శాతం పెంపు
- రోడ్డు విస్తరణలో తొలగించే దేవాలయాలకు పరిహారం
- కడప నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీలో తీర్మాణాలు



స్టాండింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కడప మేయర్ సురేష్ బాబు

కడప కార్పొరేషన్ : కడప నగరపాలక సంస్థలో పనిచేస్తూ మరణించిన 15 మంది ఔట్ సోర్సింగ్ కార్మికుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.2లక్షల చొప్పున రూ.30లక్షలు చెల్లించాలని నగరపాలక స్టాండింగ్ కమిటీ నిర్ణయించింది. బుధవారం సాయంత్రం కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ సురేష్ బాబు అధ్యక్షతన స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాసాపేటలో రోడ్ల విస్తరణ వల్ల శివాలయం, రామాలయం, గంగమ్మ గుడి తొలగించినందున వారికి రూ.27.91లక్షలు నష్ట పరిహారంగా ఇచ్చేందుకు అంగీకరించారు.

- వైఎస్సార్ కాంప్లెక్స్‌లోని 19 షాపురూములు, టీబీ కాంప్లెక్స్‌లోని 20 షాపు రూములకు 33.33 శాతం లీజు పెంచి రెన్యువల్ చేసేలా తీర్మాణం చేశారు. 43వ డివిజన్‌లో కాగితాలపెంట నుంచి పాత బస్టాండు బ్రిడ్జి వరకూ 40 అడుగుల రోడ్డు వల్ల తొలగిస్తున్న గంగమ్మ దేవాలయానికి నష్ట పరిహారం చెల్లించేందుకు సమ్మతించారు. వైఎస్సార్ షాపింగ్ కాంప్లెక్స్ ఎదుట ఉన్న ఆక్రమణలను తొలగించాలని మేయర్ అధికారులకు సూచించారు. మున్సిపల్ స్టేడియం వద్ద నున్న వైన్ షాపుల వల్ల విపరీతమైన చెత్త ఏర్పడుతున్నదని, వారికి నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. జనరల్ ఫండ్ నిధులను పొదుపుగా వాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్, డిప్యూటీ కమిషనర్ రమణారెడ్డి, స్టాండింగ్ కమిటీ సభ్యులు మల్లీశ్వరి, వై. మాధవి, ఎం. సుజాత, గౌస్ జబీన్, కె. అరుణప్రభ తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులందరికీ పరిహారం

- కేంద్ర కరువు బృందం హామీ
- జిల్లాలో 15,593 హెక్టార్లలో పంటనష్టం

రాయచోటి: ఖరీఫ్ సీజన్‌లో పంటనష్టం జరిగిన రైతులందరికీ పరిహారం అందజేస్తామని కేంద్ర కరువు బృందం హామీనిచ్చింది. అన్నమయ్య జిల్లాలోని బి కొత్తపేట, తంబళ్లపల్లె, గుర్రంకొండ, చిన్నమండెం, రామాపురం మండలాల్లో పంకజ్ యాదవ్ నేతృత్వంలోని కరువు బృంద సభ్యులు డాక్టర్ కె పొన్నుస్వామి, మహేష్ కుమార్, కైలాష్ దాస్‌లతో పాటు జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా పంకజ్ యాదవ్ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో ఈ ఏడాది కరువు వల్ల 15,593 హెక్టార్లలో పంట నష్టం జరిగినట్లు అధికారులు నివేదికలు ఇచ్చారన్నారు. ఇందులో వేరుశనగ, వరి, మొక్కజొన్న, కంది పంటలకు ఎక్కువగా నష్టం వాటిల్లిందన్నారు. వేరుశనగ పంట అధికంగా నష్టం జరిగినట్లు గుర్తించినట్లు తెలిపారు. కరువు బృందం పంట నష్టానికి గల కారణాలను గుర్తించి కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపేందుకు జిల్లాలో పర్యటించినట్లు చెప్పారు. పంటలు వేసి నష్టపోయిన రైతులందరికీ తప్పకుండా నష్టపరిహారం ఇవ్వనున్నట్లు చెప్పారు. రైతులందరూ ఏయే పంటలు ఎన్ని ఎకరాల్లో వేసి నష్టపోయారో స్పష్టంగా తెలియజేయాలన్నారు. ఈ సందర్భంగా పంటల బీమా, తాగునీరు, సాగునీరు, ఇన్‌పుట్ సబ్సిడీ, మైక్రో ఇరిగేషన్, భూగర్భ జల మట్టం, ఉపాధి హామీ కూలీల పనిదినాలు, పశువుల మేత, వాటి పరిస్థితి తదితర వాటిపై అధికారులను క్షుణ్ణంగా అడిగి వివరాలను తెలుసుకున్నారు.

రైతులను ఆదుకోవాలి: ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి

జిల్లా రైతులను ఈ ఏడాది కరువు కాటేసిందని, కేంద్ర ప్రభుత్వం నిధులతో వారిని ఆదుకునేలా చర్యలు చేపట్టాలని రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి కరువు బృందానికి విజ్ఞప్తి చేశారు.



బోనమలలో కరువు పరిస్థితులను ఫొటో ఎగ్జిబిషన్ ద్వారా కరువు బృందం సభ్యులకు వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి



గుర్రంకొండ మండలం తరిగొండ ఆర్బీకేలో పంటనష్టం, రాష్ట్రప్రభుత్వపథకాల అమలు తీరుపై ప్రజలను అడిగి తెలుసుకొంటున్న కేంద్ర కరువుబృందం సభ్యులు

ఖరీఫ్ ప్రారంభం నుంచి వర్షాలు అనుకూలించక పోవడంతో వర్షాధారంగా జీవనం సాగిస్తున్న రైతులకు నష్టం వాటిల్లిందన్నారు. అరకొరగా సాగిన వర్షాధార పంటలు కూడా ఎండిపోగా సాగుకయ్యే ఖర్చులు, వాటి వడ్డీలు పెరిగి ఆర్థికంగా కుంగిపోయారన్నారు. పాడి పరిశ్రమతో జీవనం సాగిస్తున్న వారికి వర్షాభావం కారణంగా తగినంత గ్రాసం లేక ఇబ్బందులు పడుతున్నారని, ఎండిపోయిన పంటలను చూపిస్తూ వివరించారు. చిన్నమండెం, రామాపురం మండలాలలో కరువు బృందం వెంట ఎమ్మెల్యే పర్యటించి జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితులను వివరించారు. చిన్నమండెం, రామాపురం మండలాల పరిధిలోని రైతులు మాట్లాడుతూ వ్యవసాయానికి ఉపాధిని అనుసంధానం చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ పి దేవనాథరెడ్డి, ఆర్డీఓ మురళి, సీపీఓ చంద్రనాయక్, వ్యవసాయశాఖ జేడీ చంద్రనాయక్, పశు సంవర్ధకశాఖ జేడీ గుణశేఖర్ పిళ్లై, ఉద్యానశాఖ అధికారి రవిచంద్రబాబులతో పాటు ఆయా మండలాల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

చిన్నమండెం మండలంలో..

చిన్నమండెం : మండలంలోని బోనమల గ్రామంలో కేంద్ర కరువు బృందం బుధవారం పర్యటించింది. గ్రామ నూతన సచివాలయ భవనంలో తొలుత పంట నష్టాల ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించింది. రైతులు కృష్ణమ్మ, రాజారెడ్డి, రెడ్డెప్పలు తాము పండించిన వేరుశనగ, వరి పంటల నష్టాన్ని వివరించారు. పశుసంవర్ధక శాఖ జేడీ గుణశేఖర్ పిళ్లై, వ్యవసాయ శాఖ ఏడీఏ శ్రీలత, తహసీల్దార్ శ్రీరాములు నాయక్, ఎంపీడీఓ దివ్య, ఏఓ గీత, సింగిల్ విండో అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, వైసీపీ నాయకులు బాబురెడ్డి, కోఆప్షన్ మెంబర్ గౌస్‌సాబు, ఎంపీటీసీలు వెంకటప్ప నాయుడు, రెడ్డప్ప, సర్పంచులు లోకేశ్వర్‌రెడ్డి, అఫ్రోజ్, జిల్లా విజిలెన్స్ కమిటీ మెంబర్ చుక్కా అంజనప్ప తదితరులు పాల్గొన్నారు.

గుర్రంకొండ మండలంలో..

గుర్రంకొండ: మండలంలోని తరిగొండ, మర్రిపాడు గ్రామాల్లో కేంద్ర కరువు బృందం పర్యటించింది. ఈ ఏడాది 25శాతం పంట కూడా చేతి కందలేదని రైతులు వారికి విన్నవించారు. కాగా, మండలంలో ఈ ఏడాది సాగు చేసిన పంటలో వర్షాభావంతో 304 హెక్టార్ల పంట దెబ్బ తిందని, మొత్తం 578 మంది రైతులకు పంట నష్టపరిహారం చెల్లించాలంటూ రూ.51.68 లక్షలకు ప్రతిపాదనలు పంపినట్లు అధికారులు కేంద్ర బృందం దృష్టికి తీసుకెళ్లారు. ఆయా కార్యక్రమాల్లో ఏడీఏ వాణీశ్రీ, తహసీల్దార్ ఖాజాబీ, ఎంపీడీఓ వెంకటేశులు, సింగిల్‌విండో మాజీ డైరెక్టర్ ప్రకాష్‌రెడ్డి, ఏవో రత్నమ్మ, సర్పంచ్ నందినీ, ఎంపీటీసీ యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

రామాపురంలో..

రామాపురం: మండలంలో కేంద్ర కరువు బృందం పర్యటించింది. గ్రామాల్లో నెలకొన్న కరవు పరిస్థితులను అధ్యయనం చేసింది. ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, అధికారులు కేంద్రం బృందానికి వివిధ అంశాలను తెలియజేశారు.పలువురు రైతులు మాట్లాడుతూ గ్రామాల్లో పశువులకు తాగునీరు అందించే పరిస్థితులు లేవని, ప్రభుత్వం ఆదుకోవాలని కేంద్రం బృందం సభ్యులను కోరారు.

తంబళ్లపల్లెలో..

తంబళ్లపల్లె: మండలంలోని గుండ్లపల్లె, ఎద్దులవారిపల్లె పంచాయితీలలో కరువు బృందం పర్యటింటింది. వర్షాలు లేక దెబ్బతిన్న పంటల నష్టం ఫొటో ఎగ్జిబిషన్‌ను సందర్శించిన అనంతరం రైతులతో చర్చించారు. ఎర్రసానిపల్లెకు చెందిన వీరభద్రయ్య మాట్లాడుతూ వేరుశనగ పంటకు ఎక్కువగా నష్టం వాటిల్లిందని, నష్టపరిహారం వచ్చేటట్లు చూడాలని కోరారు. పంచాలమర్రి గ్రామానికి చెందిన రైతు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ మండలంలో ఎక్కువగా పాడి రైతులు ఉన్నారని, ఈ సారి 50 శాతం పశువులకు దాణా అందలేదన్నారు. ఎద్దులవారిపల్లి గ్రామానికి చెందిన రైతు రెడ్డెమ్మ మాట్లాడుతూ మండలంలో ఎక్కువగా అడవి పందులు వస్తున్నాయని, కొండ చుట్టూ ఫెన్సింగ్ వేయడానికి అధికారులు చర్యలు చేపట్టాలని కరువు బృందం సభ్యులను కోరారు.ఈ సందర్భంగా కరువు బృందం వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా అందుతున్న సేవల గురించి ఆరా తీసింది. ఏవో రమణకుమార్, ఏపీడీ మధుబాబు, మదనపల్లె ఆర్‌డీవో మురళి, వ్యవసాయశాఖ ఏడీ దీక్షకుమారి, సర్పంచు మౌలాలి, పశువుల డాక్టర్ సుజనశ్రీ, రైతులు పాల్గొన్నారు.

చేయూతనిచ్చి ఆదుకోండి

కేంద్ర కరువు బృందానికి రైతుల వినతి

బి.కొత్తకోట: కేంద్ర కరువు పరిశీలన బృంద సభ్యులు పొన్నుస్వామి, కైలాస్‌దాస్, మహేష్ కుమార్‌లు బుధవారం బి.కొత్తకోట మండలం కోటావూరు, గొల్లపల్లెలో పర్యటించారు. కోటావూరు సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. అనంతరం సచివాలయాల్లో జరిగిన సమావేశంలో రైతులతో ముఖాముఖి మాట్లాడారు. 'సకాలంలో వర్షాలు పడక పంటలన్నీ నష్టపోయాం. కళ్లెదుటే పచ్చని పంటలు ఎండిపోయాయి. పెట్టిన పెట్టుబడులు కూడా రాక తీవ్రంగా నష్టపోయాం..కనీసం పశువుల మేత కూడా రాలేదు..ఉదారంగా ఆదుకోవాలి' అంటూ కేంద్ర బృందానికి రైతులు మొర పెట్టుకున్నారు. వారు కూడా బాధిత రైతులతో మాట్లాడి పంటల నష్టం గురించి అడిగి తెలుసుకున్నారు. సరిగ్గా పండని వేరుశనగ కాయలను కరువు బృందానికి రైతులు ఈ సందర్భంగా చూపించారు. ప్రజాప్రతినిధులు కూడా నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు.



బి.కొత్తకోట మండలం కోటావూరులో ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న కరువు బృందం

పశువుల మేత కూడా రాలేదు



అష్ట కష్టాలు పడి ఎకరంలో వేరుశనగ సాగు చేశా. రూ.25 వేలు ఖర్చయ్యింది. సకాలంలో వర్షం పడక పంట చేతికి రాక నష్టపోయా. పెట్టుబడులు రాక మరో వైపు దిగుబడులు రాక తీవ్రంగా నష్టపోయా. ఆఖరికి పశువుల మేత కూడా దక్కలేదు. భూగర్భ జలమట్టం కూడా తగ్గిపోయింది. బోర్లు వేసినా నీళ్లు పడతాయన్న గ్యారంటీ లేదు. భ్రమల్లో బతకాల్సి వస్తోంది. నష్టపోయిన పంటలకు ఆదుకుని ఉపశమనం కల్గించాలని కేంద్ర బృందానికి విన్నవించా.

–ఎం.ఎ. రామచంద్ర, పాతకురవపల్లె, బి.కొత్తకోట మండలం

మొక్కజొన్నతో మునిగిపోయా



మూడు ఎకరాల్లో రూ. 60 వేల ఖర్చుతో పంట సాగు చేశా. వర్షాలు రాక నిలువునా ఎండిపోయింది. రూ. పది వేలు కూడా గిట్టుబాటు కాలేదు. చివరకు పశువుల మేత కూడా దక్కకుండా పోయింది. ఇంత అధ్వాన పరిస్థితి ఎప్పుడూ చూడలేదు. పంటలు రాని రైతును నమ్మి అప్పులు ఇచ్చే పరిస్థితి కూడా కన్పించడం లేదు. కరుణించి ఆదుకోవాలని కేంద్ర బృందాన్ని కోరా.

–కృష్ణారెడ్డి, బి.కొత్తకోట

క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలి



ట్రోఫీ అందుకుంటున్న బాలుర విభాగంలో విన్నర్స్ వైఎస్సార్ జిల్లా జట్టు



ట్రోఫీ అందుకుంటున్న బాలుర విభాగంలో రన్నర్స్ చిత్తూరు జిల్లా జట్టు



ట్రోఫీ అందుకుంటున్న బాలిక విభాగంలో విన్నర్స్ వైఎస్సార్ జిల్లా జట్టు

- ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి వసంత
- అంతర్ జిల్లా హాకీ బాల, బాలికల విజేతలు వైఎస్సార్ జిల్లా క్రీడాకారులు

మదనపల్లె సిటీ : క్రీడల్లో గెలుపు, ఓటములు సమానంగా తీసుకుని క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలని స్కూల్ గేమ్స్ కార్యదర్శి వసంత అన్నారు. బుధవారం స్థానిక బీటీ కాలేజీ మైదానంలో 67వ అండర్-14 అంతర జిల్లా హాకీ పోటీల్లో విజేతలకు ట్రోఫీలు అందజేశారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్రం నలుమూలల నుంచి హాకీ క్రీడాకారులు ఎంతో ఉత్సాహంతో పాల్గొన్నారని తెలిపారు. క్రీడలు ఆడటం వల్ల పోటీతత్వం పెరుగుతుందన్నారు. ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో విజయభారతి పాఠశాల కరస్పాండెంట్ ఎన్.సేతు, సీనియర్ హాకీ క్రీడాకారులు రమణరావు, పీడీలు శ్రీనివాసులు, రమేష్, మాజీ ఎస్‌జీఎఫ్ సెక్రటరీ రామ, పలువురు పీడీలు పాల్గొన్నారు. పోటీల్లో సత్తా చాటిన జట్లు ఈనెల 27న రాజస్థాన్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని ఎస్‌జీఎఫ్ కార్యదర్శి వసంత తెలిపారు.

బాలుర విజేత వైఎస్సార్ జిల్లా

అంతర్ జిల్లా హాకీ పోటీల్లో అండర్ -14 విభాగంలో ఫైనల్స్‌లో కడప-చిత్తూరు జట్లు పోటీ పడగా వైఎస్సార్ జిల్లా జట్టు గెలుపొంది విన్నర్స్‌గా నిలిచింది. రన్నర్స్‌గా చిత్తూరు జిల్లా, మూడవ స్థానం విశాఖపట్నం, నాల్గవ స్థానం ప్రకాశం జిల్లా దక్కించుకున్నాయి.

బాలికల విజేత వైఎస్సార్ జిల్లా

అంతర్ జిల్లా హాకీ పోటీల్లో అండర్-14 విభాగంలో ఫైనల్స్‌లో వైఎస్సార్ జిల్లా- విశాఖపట్నం జట్లు పోటీపడగా వైఎస్సార్ జిల్లా జట్టు విన్నర్స్‌గా నిలిచింది. విశాఖపట్నం జట్టు రన్నర్స్‌గా, మూడవ స్థానం అనంతపురం, నాల్గవ స్థానంలో తూర్పుగోదావరి జిల్లా నిలిచింది.

క్లుప్తంగా

మిద్దెపైనుంచి పడి వ్యక్తి మృతి

పుల్లంపేట : మండల పరిధిలోని రంగంపల్లికి చెందిన వెంకటసుబ్బయ్య (50) కూలిపనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. బుధవారం రంగంపల్లి గ్రామంలో మిద్దెపని చేస్తుండగా కాలుజారి కిందపడటంతో తలకు బలమైన గాయమైంది. మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

లారీని ఢీకొని..

పుల్లంపేట : పుల్లంపేట మండల కేంద్రంలోని పుల్లంగేరు బ్రిడ్జి వద్ద ఆగి ఉన్న లారీని వెనుక వైపు నుంచి ఢీకొన్న సంఘటనలో షేక్ నజీర్(31) అనే యువకుడు మృతి చెందాడు. వివరాలు ఇలా..మంగళవారం రాత్రి తిరుపతి నుంచి కడపకు వెళ్తున్న లారీ మరమ్మతుకు గురికావడంతో బ్రిడ్జిపై నిలబెట్టి ఉంచారు. ఇదే సమయంలో తిరుపతి నుంచి రాజంపేటకు ద్విచక్ర వాహనంపై వస్తున్న షేక్ నజీర్ (31) లారీ వెనుకవైపు ప్రమాదవశాత్తు ఢీ కొన్నాడు. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడ్డాడు. హుటాహుటిన పుల్లంపేట పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలిస్తుండగా మార్గమధ్యంలో చనిపోయినట్లు ఎస్‌ఐ రఘురాం తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

టిప్పర్ ఢీకొని..



టిప్పర్ ఢీకొని మృతి చెందిన ఏకాంబరం

పీలేరురూరల్ : టిప్పర్ ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం సాయంత్రం పీలేరు పట్టణం వినాయకస్వామి ఆలయం వద్ద చోటు చేసుకుంది. స్థానిక పాత మసీదు వీధికి చెందిన ఏకాంబరం (65) అజంతా మిట్ట సమీపంలో క్లౌ రశాల నిర్వహించేవాడు. బుధవారం సాయంత్రం మదనపల్లె మార్గంలోని వినాయకస్వామి ఆలయం వద్ద రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళుతుండగా, దామలచెరువు నుంచి కదిరికి వెళుతున్న టిప్పర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఏకాంబరం అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్‌ఐ నరసింహుడు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

మదనపల్లె : గుర్తు తెలియని మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన బుధవారం మదనపల్లె మండలంలో జరిగింది. తట్టివారిపల్లె వద్ద తిరుపతి-మదనపల్లె మార్గంలోని చెరువు కట్ట సమీపంలో, రోడ్డు పక్కన చింతచెట్టు కింద ఓ మహిళ మృతదేహం పడి ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. వెంటనే తాలూకా పోలీసులకు సమాచారం అందించారు.

సమాచారం అందుకున్న తాలూకా సీఐ శేఖర్, ఎస్.ఐ సుధాకర్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పరిశీలించి ఆధారాల కోసం వెతికారు. మృతి చెంది దాదాపు 7-10 రోజులు అయి ఉంటుందని ప్రాథమికంగా నిర్ధారించారు. మృతురాలు పసుపు, ఎరుపు రంగులతో మిళితమైన పూలచీర, ఎర్రరంగు లంగా, బ్రౌన్ కలర్ పూల జాకెట్ ధరించి ఉంది. చేతికి మట్టిగాజులు ఉన్నాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించేందుకు వీలుకాకపోవడంతో సంఘటనా స్థలంలోనే శవ పంచనామా నిర్వహించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాలూకా సీఐ శేఖర్ తెలిపారు.

ఉద్యోగుల సమస్యలు త్వరలో పరిష్కారం

రాయచోటి అర్బన్ : ఉద్యోగుల సమస్యలు త్వరలో పరిష్కారం అవుతాయని ఏపీ ఎన్‌జీఓ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు అన్నారు. బుధవారం స్థానిక ఎన్‌జీఓ సభా భవనంలో జరిగిన రాయచోటి ఎన్‌జీఓ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బి.శ్రీనివాసులు, కె.వి.శివారెడ్డిలు సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ పెద్దలతో చర్చలు జరుపుతున్నారన్నారు. అనంతరం రాయచోటి ఎన్‌జీఓ అసోసియేషన్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సహ అధ్యక్షుడు శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ శ్రీనివాసులు, రామమోహన్, వెంకటరమణలను ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఎన్‌జీఓ సంఘం రాయచోటి అధ్యక్ష, కార్యదర్శులు వేణుగోపాల్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, జిల్లా కోశాధికారి నిత్యపూజయ్య, ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, లక్కిరెడ్డిపల్లె అధ్యక్షుడు బలరామరాజు తదితరులు పాల్గొన్నారు.



నూతనంగా ఎంపికైన కార్యవర్గ సభ్యులతో ఎన్‌జీఓ సంఘం జిల్లా నేతలు

సైన్స్‌ఫేర్‌లో విద్యార్థులను భాగస్వాములను చేయండి

జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీరామ్ పురుషోత్తం

రాయచోటి : దక్షిణ భారతదేశ స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో భాగంగా అన్నమయ్య జిల్లాలో వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించి విద్యార్థులలో దాగి ఉన్న అన్వేషణలను ప్రోత్సహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీరామ్‌పురుషోత్తం ఉపాధ్యాయులను ఆదేశించారు. పాఠశాల విద్యా కమిషనర్ సురేష్‌కుమార్ ఉత్తర్వుల మేరకు విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్ అండ్ టెక్నలాజికల్ మ్యూజియం, నేషనల్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ మ్యూజియంల సహకారంతో అన్నమయ్య జిల్లా విద్యాశాఖ పాఠశాల, మండల, జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహిస్తోందన్నారు.

ప్రాజెక్టుల అంశాలు

భౌతికశాస్త్రం, రసాయనిక శాస్త్రం, గణితం, భూగోళ శాస్త్రం, అంతరిక్ష శాస్త్రం, పర్యావరణ శాస్త్రం, ఇంజినీరింగ్, జీవశాస్త్రం, జీవ రసాయనిక శాస్త్రం, కంప్యూటర్ సైన్స్‌ల నుంచి ప్రాజెక్టులు రూపొందించాలని పేర్కొన్నారు.

ప్రదర్శించాల్సిన ప్రాజెక్టుల విభాగాలు

- టీచర్ ఎగ్జిబిట్
- విద్యార్థుల వ్యక్తిగత ఎగ్జిబిట్
- విద్యార్థుల గ్రూప్ ఎగ్జిబిట్
- టీచర్ విభాగంలో మ్యాథ్స్, సైన్స్, సోషల్ సబ్జెక్టు టీచర్స్ వారి ఎగ్జిబిట్‌ను ప్రదర్శించవచ్చు.
- విద్యార్థుల వ్యక్తిగత ఎగ్జిబిట్‌లో ఒక విద్యార్థి, ఒక గైడ్ టీచర్ పాల్గొనవచ్చని తెలిపారు.
- విద్యార్థుల గ్రూప్ ఎగ్జిబిట్‌లో ఇద్దరు విద్యార్థులు, ఒక గైడ్ టీచర్ పాల్గొనవచ్చని వివరించారు.

ఎప్పుడు నిర్వహించాలి

ఈ నెల 15వ తేదీన పాఠశాల స్థాయిలో, 19న మండల స్థాయిలో 23న జిల్లా స్థాయిలో పోటీలు ఉంటాయన్నారు. పాఠశాల స్థాయిలో అత్యుత్తమంగా నిలిచిన ఒక టీచర్ ప్రాజెక్టు, ఒక వ్యక్తిగత ప్రాజెక్టు, ఒక గ్రూపు ప్రాజెక్టు మొత్తం 3 ప్రాజెక్టులను ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో ఎంపిక చేసి మండల స్థాయికి పంపాల్సి ఉంటుందన్నారు. మండల స్థాయి ప్రదర్శనలో అత్యుత్తమంగా నిలిచిన ఒక టీచర్ ప్రాజెక్టు, ఒక వ్యక్తిగత ప్రాజెక్టు, ఒక గ్రూపు ప్రాజెక్టు మొత్తం 3 ప్రాజెక్టులు నోడల్ హెడ్మాస్టర్, మండల విద్యా శాఖాధికారి ఆధ్వర్యంలో ఎంపిక చేసి ప్రతి మండలం నుంచి 3 ప్రాజెక్టులు జిల్లా స్థాయికి పంపాల్సి ఉంటుంది.

సమాజాభివృద్ధికి దోహదపడే ప్రాజెక్టులను రూపొందించాలి



విద్యార్థులు తమ పరిసరాలను పరిశీలించి నిత్య జీవితంలో ఉన్న అనేక సమస్యలకు చక్కటి పరిష్కారాన్ని చూపే ప్రాజెక్టులు రూపొందించాలి. తద్వారా సమాజ సమస్యలకు పరిష్కారం చూపాలి. శాస్త్ర సాంకేతికతను అందిపుచ్చుకొని అంతర్గతంగా ఉన్న అన్వేషణలను వెలికి తీసేటట్లు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహించాలి. – శ్రీరాంపురుషోత్తం, జిల్లా విద్యాశాఖ అధికారి

బాల శాస్త్రవేత్తలను ప్రోత్సహిద్దాం



విద్యార్థులను ప్రోత్సహిస్తే నూతన ఆవిష్కరణలు వెలుగులోకి వస్తాయి. వారిలోని అన్వేషణాత్మక ఆలోచనలకు పదును పెడితే భావి శాస్త్రవేత్తలను రూపొందించవచ్చు. పాఠశాల స్థాయి నుంచి విజ్ఞాన ప్రదర్శనలను విజయవంతంగా నిర్వహించడం ద్వారా మాత్రమే ఇది సాధ్యమవుతుంది. ప్రభుత్వ పాఠశాలలోని పేద విద్యార్థులు మట్టిలోని మాణిక్యాలు. వారిని ప్రోత్సహించాలి. – మార్ల ఓబుల్‌రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి

నవశకం

కుల, ఆదాయ సర్టిఫికెట్లు వచ్చాయి



జగనన్న సురక్షలో నాకు కుల, ఆదాయ సర్టిఫికెట్లు సులభంగా వచ్చాయి. 12 ఏళ్లుగా బియ్యం కార్డు కోసం ప్రయత్నించినా రాలేదు. ఇదివరలో సచివాలయ సిబ్బంది ఇంటికి వచ్చి కార్డుకు రాశారు. ఇటీవల కొత్త కార్డు రానే వచ్చింది. జీవితంలో తొలిసారిగా స్టోరులో బియ్యం కూడా తీసుకున్నా. చెప్పలేని ఆనందం కలిగింది. నిత్యావసర సరుకులతో బతుకు భరోసా లభించింది. ఒంటరి మహిళ పింఛన్ రాస్తామన్నారు. చేయూత పథకం, పక్కా ఇల్లు వస్తుందన్నారు. డ్వాక్రా గ్రూపులో చేరుతున్నా. ఆదాయ, కుల సర్టిఫికెట్ వచ్చింది. ఆరోగ్యశ్రీ కార్డు, ఉపాధి హామీ కార్డు ఇస్తామన్నారు. ఒక్క కార్డుతో ఇన్ని ప్రయోజనాలున్నాయని తెలీదు. ఇది జీవితాన్ని కొత్త మలుపు తిప్పింది. గతంలో ఏళ్లుగా ప్రయత్నించినా రాని బియ్యం కార్డు సీఎం జగన్ పాలనలో పైసా ఖర్చు లేకుండా సులభంగా చేతికి వచ్చింది. – జి.వేమక్క, చింతయ్యగారికోట, కురబలకోట మండలం

గ్రామీణ పాఠశాలలకు మహర్దశ



గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక పాఠశాలల్లో సౌకర్యాలు లేక శిథిలావస్థకు చేరుకుని ఉండేవి. రాష్ట్రానికి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక నాడు-నేడుతో ప్రాథమిక పాఠశాలలకు పక్కా భవనాలు, నూతన మరుగుదొడ్లు ఏర్పాటు చేయించారు. పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందిస్తున్నారు. – పైడల చంద్రశేఖర్‌రెడ్డి, హెడ్ మాస్టర్, జి.వడ్డేపల్లి, ఓబులవారిపల్లె.

బిడ్డలతో సహా తల్లి అదృశ్యం

కలికిరి : ఇద్దరు బిడ్డలతో సహా తల్లి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మదనపల్లి మండలం కొత్తవారిపల్లికి చెందిన ఎస్.నిరంజన్ భార్య ఎస్.మౌనిక, కుమార్తెలు శిరీషా, సౌజన్యలతో మండలంలోని మూరేవాండ్లపల్లికి తన పుట్టింటికి వచ్చింది. అక్కడి నుంచి ఈ నెల 9న తన అమ్మమ్మ ఇల్లు నగిరిపల్లికి వెళుతున్నట్లు పుట్టింటి నుంచి బయల్దేరింది. కానీ అమ్మమ్మ ఇంటికి గానీ, భర్త ఇంటికి గానీ వెళ్లలేదు. అప్పటి నుంచి బంధువులు, చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో మౌనిక తల్లి శ్రీదేవి పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

‘సీమ’ ప్రాంత స్త్రీల సమగ్ర సాహిత్యంపై అవగాహన అవసరం

వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్

వైవీయూ : రాయలసీమ ప్రాంత స్త్రీల సమగ్ర సాహిత్యం అవపోసన పట్టడంతోపాటు ఆ దిశగా నేటి తరం ముందుకు వెళ్లేందుకు సాహితీ సదస్సులు దోహదపడతాయని యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య చింతా సుధాకర్ అన్నారు. కేంద్ర సాహిత్య అకాడమి, న్యూఢిల్లీ , యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప సంయుక్త నిర్వహణలో ‘నారీ చేతన’ పేరుతో ‘రాయలసీమ స్త్రీల సాహిత్యం’ అనే అంశంపై సింపోజియం వైవీయూలోని మొల్ల సమావేశ మందిరంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఉపకులపతి మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో మహిళా కవయిత్రుల కృషి తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తాళ్లపాక తిమ్మక్క, తరిగొండ వెంగమాంబ వంటి మహిళా సాహితీవేత్తల కృషి ఆదర్శనీయమన్నారు. సభకు అధ్యక్షత వహించిన సాహిత్య అ కాడమీ తెలుగు సలహా మండలి సభ్యురాలు ఆచార్య ఎం.ఎం.వినోదిని మాట్లాడుతూ కరువు, వర్గ కక్షల ప్రచారం జరిగినంతగా సీమ సాహిత్యం బహిర్గతం కాలేదన్నారు. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ఆచార్యులు ఆర్.రాజేశ్వరమ్మ ‘రాయలసీమ ప్రాచీన రచయిత్రులు’ అనే అంశంపై మాట్లాడుతూ ప్రాచీన సాహిత్య మూలాల్లోకి వెళితే వారి రచనల ద్వారా స్త్రీ హృదయం కనిపిస్తుందన్నారు. నెల్లూరుకు చెందిన రచయిత ప్రతివ తదితరులు మాట్లాడారు.

చోరీకి గురైన స్కూటీ అప్పగింత

నందలూరు(రాజంపేట) : ఈనెల 8న నందలూరు మండలం నాగిరెడ్డిపల్లె హరిజనవాడలో చోరీకి గురైన స్కూటీని బాధితుడికి అప్పగించినట్లు ఎస్‌ఐ అబ్దుల్ జహీర్ తెలిపారు. స్కూటీ ప్రకాశం జిల్లా నల్లఉప్పలపాడు పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్నట్లు గుర్తించామన్నారు. మతిస్థిమితం లేని వ్యక్తి దాన్ని తీసుకెళ్లాడని తెలిపారు. స్కూటీని సంబంధిత యజమాని మణికి అప్పగించామన్నారు.



స్కూటీని యజమానికి అప్పగిస్తున్న ఎస్‌ఐ అబ్దుల్ జహీర్

ఐదుగురు జూదరుల అరెస్టు

నందలూరు గ్రామం అరుంధతీవాడ సమీపంలోని గంజేషాహిద్ అరబ్ షావల్లి దర్గా వద్ద మంగళవారం రాత్రి ఐదుగురు జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ అబ్దుల్ జహీర్ తెలిపారు. వారి నుంచి రూ.2050 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు భారతి డీఏవీ స్కూల్ విద్యార్థుల ఎంపిక

కమలాపురం : కమలాపురం మండలం నల్లింగాయపల్లెలో ఉన్న భారతి డీఏవీ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. హైదరాబాద్‌లోని సఫిల్ గూడా డీఏవీ స్కూల్‌లో ఇటీవల జరిగిన స్టేట్ లెవెల్ డీఏవీ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ పోటీల్లో ఇక్కడివిద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్ -17 బాలుర విభాగంలో పదవ తరగతి చదువుతున్న బి. విష్ణువర్ధన్ రెడ్డి 800 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానంలో నిలిచాడు. పదవ తరగతి చదువుతున్న కె.జితేంద్రరెడ్డి డిస్కస్ త్రోలో ద్వితీయ స్థానంలో నిలిచాడు. అండర్ - 17 బాలికల విభాగంలో ఎం.రెడ్డి లక్ష్మి లాంగ్ జంప్‌లో ద్వితీయ స్థానంలో నిలిచింది. వీరు త్వరలో జరిగే డీఏవీ జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని పాఠశాల ప్రిన్సిపల్ ఎస్.కిషోర్ కుమార్ తెలిపారు. ఈ మేరకు భారతి సిమెంట్ కర్మాగారం సీఎంఓ సాయి రమేష్, హెచ్ఆర్ గోపాల్ రెడ్డి, డీఏవీ ప్రాంతీయ అధికారి శేషాద్రి బుధవారం విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయుడు చందును అభినందించారు.



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన భారతి డీఏవీ స్కూల్ విద్యార్థులు

హృదయం..పదిలం

- గుండె దడకు ప్రథమ చికిత్స
- స్టెమీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన ప్రభుత్వం
- తక్షణమే ఇంజెక్షన్‌తో బాధితులకు భరోసా

మదనపల్లె సిటీ : మనిషి గుండె పిడికెడు. అదే ప్రాణానికి మూలం. అలుపూ సొలుపూ లేకుండా శక్తివంతంగా పని చేసే సజీవ యంత్రం. అయితే ఆధునిక జీవనం.. అనారోగ్యపూరిత ఆహారపు అలవాట్లతో హృదయం గతి తప్పుతోంది. చెట్టంత మనిషిని నిలువునా కుంగదీస్తోంది. ఈ విషయం గుర్తించిన ప్రభుత్వం స్టెమీ కార్యక్రమం అమలుతో పేదల చిన్ని గుండెకు రక్షణ కల్పిస్తోంది.

స్టెమీ అంటే..

రాష్ట్ర ప్రభుత్వం వైద్య సేవలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. అందులోనూ పేదలకు ఖరీదైన వైద్యాన్ని పల్లె ముంగిటకే తీసుకొస్తోంది. ప్రధానంగా గుండె దడకు బ్రేకులు వేస్తోంది. పేదల ఊపిరికి ఊతమిస్తోంది. స్టెమీ (ఎస్‌టీ ఎలివేషన్ మయోకార్డియల్ ఇన్‌ఫార్‌క్షన్) అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. జిల్లాలో మదనపల్లె, రాయచోటి, తంబళ్లపల్లె, బి.కొత్తకోట, వాల్మీకిపురం, పీలేరు, రాజంపేట, లక్కిరెడ్డిపల్లె, రైల్వేకోడూరులలోని ఆస్పత్రులు, సీహెచ్‌సీలలో స్పోక్స్ సెంటర్లను ప్రారంభించి గుండె నొప్పి నుంచి బయటపడేలా చేస్తోంది.

పెరుగుతున్న హృద్రోగులు

జిల్లాలో మధుమేహం, రక్తపోటుతో పాటు గుండె సంబంధిత వ్యాధులతో ఇబ్బంది పడుతున్నారు. మనిషి ఆహార నియమాలు పాటించకపోవడంతో గుండెకు చిల్లులు పడుతున్నాయి. బీపీ, మధుమేహం, ఊబకాయం వంటి రోగాలు గుండెదడ పుట్టిస్తున్నాయి. మానసిక వ్యాధి కూడా మనిషికి గుండె నొప్పిని తెచ్చి పెడుతోంది. ఈ క్రమంలోనే ఇటీవల చాలా మంది ఛాతీలో కాస్తంత నొప్పి రాగానే ఆస్పత్రికి వెళుతున్నారు. తీరా వెళ్లాక నిజంగానే హార్ట్ స్ట్రోక్ వచ్చిందంటూ ఎమర్జెన్సీగా స్టంట్ వేయడం, లేదంటే శస్త్ర చికిత్స చేయాల్సి రావడమో జరుగుతోంది. దీనికి భిన్నంగా కనిపించే కేసులు కూడా ఉంటున్నాయి. గుండె జబ్బు బారిన పడి నిమిషాలు, గంటల వ్యవధిలో చనిపోయే వారి సంఖ్య జిల్లాలో పెరుగుతూ వస్తోంది. కరోనా తర్వాత ఈ కేసులు సంఖ్య మరింత పెరిగింది. ఆస్పత్రికి వెళ్లే లోపు ప్రాణాలు కోల్పోతున్నారు. ఇలాంటి కేసులు జిల్లాలో ఏటా పదుల సంఖ్యలో నమోదవుతున్నాయి. అలాగే నాన్ కమ్యూనికబుల్ డీసీజెస్(ఎన్‌సీడీ) సర్వే కేసులను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. గుండె జబ్బుల నివారణకు చర్యలు చేపట్టింది. స్టెమీ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రారంభించింది.

రోగులకు స్టెమీతో భరోసా

జిల్లాలో 9 స్పోక్స్ సెంటర్లలో సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి ఇప్పటి వరకు పలువురికి ఈసీజీ తీశారు. ఇందులో థ్రాంబోలైసిస్ ఇంజెక్షన్ ఇవ్వగా, మరి కొందరిని తిరుపతిలోని హబ్‌కు రెఫర్ చేశారు. తద్వారా గుండెనొప్పితో బాధపడవుతున్న వారికి స్టెమీ కార్యక్రమం భరోసా కల్పిస్తోంది.

స్టెమీ కార్యక్రమం ఇలా..

స్టెమీ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఏపీవీపీ పరిధిలో ఉన్న ఏరియా ఆస్పత్రులు, సీహెచ్‌సీలు, జిల్లా ఆస్పత్రుల్లో 24 స్పోక్ సెంటర్లు ఏర్పాటు చేశారు. ఈ సెంటర్లకు 12 లీడ్స్ ఉండే ఈసీజీ మిషన్ అందజేశారు. అలాగే కంప్యూటర్ అందజేసి స్టెమీ సాఫ్ట్‌వేర్‌ను అందులో అప్‌లోడ్ చేయించారు ఐసీయూ బెడ్, ఐవీ స్టాండ్, మల్టీ పారా మానిటర్, 26 రకాల అత్యవసర విభాగంలో పని చేసే డాక్టర్లు సిబ్బందితో పాటు ప్రత్యేకంగా డేటా ఎంట్రీ ఆపరేటర్, స్టాఫ్‌నర్సును కేటాయించారు.




హృద్రోగికి ఈసీజీ పరీక్ష చేస్తున్న దృశ్యం



స్టెమీ ద్వారా ఈసీజీ రిపోర్టు తీస్తున్న సిబ్బంది

గుండె నొప్పి తో స్పోక్స్ సెంటర్‌కు వచ్చిన వారికి తక్షణమే ఈసీజీ తీస్తారు. దీన్ని ఇంటర్‌నెట్‌కు కనెక్ట్ చేస్తారు. ఆ రిపోర్టును స్టెమీ యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఇలా చేసిన వెంటనే రెండు నిమిషాల్లో ఆ రిపోర్టు వివరాలు తిరుపతి రుయాలోని హబ్‌కు చేరుతాయి. అక్కడున్న గుండె వైద్యనిపుణులు, రిపోర్టు చూసి.. ఎలాంటి చికిత్స చేయాలో ఆ యాప్‌లోనే నమోదు చేస్తారు. దీని ఆధారంగా స్పోక్స్ సెంటర్‌లోని సిబ్బంది రోగికి చికిత్స అందిస్తారు అత్యవసరమైన వ్యక్తికి సెంటర్‌లోలనే థ్రాంబోలైసిస్ ఇంజెక్షన్ ఇస్తారు. తరువాత హబ్‌కు రెఫర్ చేస్తారు. ఈ ఇంజెక్షన్ ధర మార్కెట్‌లో రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. ఇలాంటి ఇంజెక్షన్‌లు జిల్లా ఆస్పత్రులు, ఏరియా, సీహెచ్‌సీలలో అందుబాటులో ఉంచామని అధికారులు చెబుతున్నారు. తద్వారా తీవ్ర గుండె నొప్పితో వచ్చిన వారికి ఈ స్టెమీ కార్యక్రమం ప్రాణం పోస్తోంది. గోల్డెన్ అవర్‌లో చికిత్స అందేలా చేస్తోంది.

ఊపిరి పోస్తోంది



జీవనశైలిలో మార్పుల కారణంగా గుండెపోటు సర్వసాధారణగా మారింది. ఎక్కువగా మగవాళ్ల గుండె జబ్బులతో చనిపోతున్నారు. శారీరక, ఆరోగ్య సమస్యలు, కుటుంబ కలహాలు, మానసిక రుగ్మతలు తదితర కారణాలతో గుండెపై భారం పడుతోంది. ఈ ప్రభావంతో మనిషి క్షణాల్లో మృతి చెందుతున్నాడు. ఇలాంటి వ్యాధుల నివారణే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం స్టెమీ కార్యక్రమాన్ని తీసుకొచ్చింది. వేలాది రూపాయల విలువ చేసే ఇంజెక్షన్ ఉచితంగా అందించి, బాధితులకు ఊపిరి పోస్తోంది. స్ట్రోక్ వచ్చినప్పుడు వెంటనే స్పోక్స్ సెంటర్‌కు తరలించాలి. – డాక్టర్ వెంకటరామయ్య, మెడికల్ ఆఫీసర్, సీహెచ్‌సి, తంబళ్లపల్లె.